క్లుప్తంగా

కస్తూరి నర్సయ్యకు ఎమ్మెల్యే సన్మానం



డీఎల్‌డీఏ డైరెక్టర్ నర్సయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

చిలుకూరు : జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ పాలకవర్గాన్ని మరో రెండేళ్ల పాటు పొడిగించిన సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ చిలుకూరు గ్రామానికి చెందిన కస్తూరి నర్సయ్యను శనివారం గ్రామంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు.

కమిషనర్‌కు సత్కారం

హుజూర్‌నగర్ : ఇటీవల బాధ్యతలు చేపట్టిన హుజూర్‌నగర్ మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లును శనివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బి.గోవిందరావు, ధనుంజయ నాయుడు, డి.శ్రీనివాస్, జి.అంజి, జి.దీప, ఎస్.అర్చనాదేవి, కె.వెంకటేశ్వర్లు, ఎస్.శీను, నరసింహచారి, కె.శేఖర్, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ



విద్యార్థులకు మజ్జిగ, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న వాసవి, వనిత క్లబ్‌ల సభ్యులు

నేరేడుచర్ల : భారతదేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా వాసవి, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో మున్సిపాలిటీలోని రాజీవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు మజ్జిగ, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వాసవీ, వనితా క్లబ్‌ల సభ్యులు గరిణె అరుణకుమారి, ప్రసాద్, కందిబండ వాసంతి, శ్రీలత, అశోక్, నటరాజ్, అంగన్‌వాడీ టీచర్ పాపమ్మ, ఆశ వర్కర్ సీత, ఏఎన్‌ఎం పుష్పావతి తదితరులు ఉన్నారు.

డీసీఓకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్‌లు

కోదాడరూరల్ : మండల పరిధిలోని గుడిబండలో కోదాడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో గోడౌన్ నిర్మించేందుకు సర్వే నెంబర్ 120లో రెండెకరాల భూమిని కలెక్టర్ మంజూరు చేశారు. నిర్మాణంలో భాగంగా ముందస్తుగా ప్రహరీ నిర్మించేందుకు శనివారం సూర్యాపేటలో డీసీఓను కలిసి అనుమతి కొరకు చైర్మన్ ఆవుల రామారావు ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. అదే విధంగా గోడౌన్ నిర్మాణం కొరకు చేసిన తీర్మాణ కాపీలను డీసీఓకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, సీఈఓ మంద వెంకటేశ్వర్లు ఉన్నారు.

ప్రతి రైతు అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేయాలి

చిలుకూరు : వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ప్రతి రైతు అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేయాలని సామాజిక కార్యకర్త ఎం.గోపయ్య కోరారు. శనివారం మండల పరిధిలోని పోలేనిగూడెం, జెర్రిపోతులగూడెం, కొండాపురం, ఆర్లెగూడెం, రామాపురం గ్రామాలలో ప్రకృతి వ్యవసాయంపై రైతు చైతన్య యాత్ర నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలానుగుణంగా రోజురోజుకూ పంటల సాగుకు పెట్టుబడులు పెరుగుతున్నాయని, రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం పెరిగిందన్నారు. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. కాబట్టి ప్రతి రైతు కుటుంబం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. అలాగే భూసార పరిరక్షణ, సహజసిద్ధ వనరులతో చీడ, పీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు.

గడ్డివాములు దగ్ధం

తుంగతుర్తి : గడ్డివాములు దగ్ధమైన సంఘటన తుంగతుర్తి శివారులో శనివారం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన రైతులు షేక్.మీరాసాబ్, షేక్.యాకూబ్, షేక్.చిన్నమీరాసాబ్, షేక్.చిన్నయాకూబ్‌లు ఇటీవల వరికోతలు పూర్తవడంతో తమ వ్యవసాయ క్షేత్రాల్లో గడ్డిని వాములుగా పేర్చుకున్నారు. కాగా ఓ రైతు తన వ్యవసాయ క్షేత్రంలో వరికొయ్యలకు నిప్పుపెట్టగా ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు గడ్డివాములకు అంటుకుని పూర్తిగా దగ్ధమయ్యాయి. అలాగే పలువురు రైతుల పైపులు, స్టార్టర్లు, వైర్లు కాలిపోయాయి. రైతులు ఫైరింజన్‌కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి మంటలను చల్లార్చారు. ఈ ఘటనలో సుమారు రూ.2లక్షల మేర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తమకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం



చిలుకూరులోని నర్సరీలో ఏపుగా పెరుగుతున్న మొక్కలు



కొండాపురంలో..

- 17 నర్సరీల్లో పెరుగుతున్న 2.07 లక్షల మొక్కలు
- తొలకరి జల్లులు కురవగానే తొమ్మిదవ విడత హరితహారం

చిలుకూరు : తొమ్మిదవ విడత హరితహారానికి అధికారులు అంతా సిద్ధం చేస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చిలుకూరు మండలంలోని పలు గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేసి ప్రజలకు ఉపయోగపడే పండ్లు, పూల మొక్కలు, నీడనిచ్చే మొక్కలతో పాటు తదితర మొక్కలను పెంచుతున్నారు. ఇక జూన్ మాసంలో తొలకరి జల్లులు కురవగానే గ్రామాల్లోని రోడ్ల వెంట, ప్రభుత్వ స్థలాలు, ఖాళీ స్థలాలు, ఇళ్లలో మొక్కలు నాటేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు.

లక్ష్యం.. 2 లక్షల మొక్కలు

మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో సుమారుగా 2 లక్షల 7 వేల మొక్కలు నాటేందుకు లక్ష్యం పెట్టుకుని అధికారులు నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నారు. దీంతో నర్సరీల్లో నాటిన టేకు, దానిమ్మ, జామ, బొప్పాయి, సీతాఫలం, గుల్‌మోర్, గుమ్మడి టేకు, వేప, చింత, గానుగ, పూల మొక్కలు ఏపుగా పెరిగి హరితహారానికి సిద్ధంగా ఉన్నాయి. మొత్తంగా 40 రకాల మొక్కలు పెంచుతున్నారు. ఈ నర్సరీలను నిత్యం ఉపాధి హామీ పథకం అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షిస్తున్నారు. గతంలో కేవలం అటవీ శాఖ నర్సరీలు మాత్రమే ఉండేవి. కానీ ప్రస్తుతం గ్రామ గ్రామ నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నారు.

నాణ్యంగా పెంచుతున్నాం



మండలంలో 17 గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నాం. ఈ నర్సరీల్లో సుమారుగా 2 లక్షలకు పైగా మొక్కలు పెరుగుతున్నాయి. జూన్ నెలలో జరిగే హరితహారం కార్యక్రమానికి మొక్కలు సిద్ధం చేస్తున్నాం. ఈ నర్సరీల్లో 40 రకాల మొక్కలు ఉన్నాయి. ఈ నర్సరీలను నిత్యం పరిశీలించి నాణ్యంగా మొక్కలు పెంచేందుకు కృషి చేస్తున్నాం.

– కె.ఈదయ్య, ఎంపీడీఓ, చిలుకూరు

నకిలీ విత్తనాల విక్రయంపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి పశ్య పద్మ

హుజూర్‌నగర్ : వానాకాలం సీజన్ ప్రారంభవవుతున్నందున నకిలీ విత్తనాల విక్రయదారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి పశ్య పద్మ అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై పీడీ యాక్టు కేసులు పెడతామని ప్రకటించిన ప్రభుత్వం, నకిలీ విత్తనాలు దొరికిన ప్రాంతాలలో వారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేయకపోవడాన్ని ఆమె తప్పుబట్టారు. అటువంటి వారిపై పీడీ యాక్టు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన అన్ని వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని కోరారు. రైతు రుణమాఫీ చేయకపోతే కొత్త రుణాల కోసం రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి మోసపోవాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం లక్ష లోపు రుణాలను ఏకకాలంలో మాఫీ చేసి రైతులకు పడిన వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరించాలని ఆమె డిమాండ్ చేశారు. రైతుల రుణాలు మాఫీ చేస్తున్నామని ఒక వైపు ప్రభుత్వం ప్రకటిస్తుండగా మరో వైపు రుణం చెల్లించడం లేదని అధికారులు నోటీసులు జారీ చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ విషయమై వ్యవసాయ మంత్రి, కమిషనర్ స్పందించి రైతులకు నోటీసులు ఇవ్వకుండా ఆపాలన్నారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు విత్తనాలు, ఎరువులు అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంబాల శ్రీనివాస్, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, నాయకులు మామిడి నర్సయ్య, జక్కుల రమణ పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట మండల బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాన్ని పట్టణ పరిధిలోని సీతారామ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సాయంత్రం 5గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలి



హుజూర్‌నగర్ : బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు శానంపూడి, బొల్లం, చిరుమర్తి



హుజూర్‌నగర్ : ఆర్డీఓను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి, రెవెన్యూ ఉద్యోగులు



వెంకటరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేస్తున్న పల్లె, బస్తీ దవాఖానాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని మాధవరాయినిగూడెంలో నూతనంగా నిర్మించిన బస్తీ దవాఖానాను శుక్రవారం రాత్రి ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్య యాదవ్, చిరుమర్తి లింగయ్యలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ వైద్య సేవలు అందాలనే ఉద్దేశంతో పల్లె, బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, కౌన్సిలర్ ఎ.గంగరాజు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సుష్మ, బీఆర్‌ఎస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు

హుజూర్‌నగర్ : నిబద్ధతతో పనిచేసే ఉద్యోగులకు మంచి గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ నుంచి జహీరాబాద్‌కు బదిలీపై వెళ్తున్న ఆర్డీఓ కె.వెంకారెడ్డికి నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని శనివారం పట్టణంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ఈ రెవెన్యూ డివిజన్‌కు మొదటి ఆర్డీఓగా వచ్చి ఎన్నో క్లిష్ట సమస్యలను చాకచక్యంగా పరిష్కరించారని అన్నారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి ఆర్డీఓ తన సేవలను ప్రజలకు అందించారని ఎమ్మెల్యే కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు రెవెన్యూ అధికారులు, పలువురు స్థానికులు ఆర్డీఓను శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గూడెపు శ్రీను, జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లు, తహసీల్దార్లు జయశ్రీ, దామోదర్‌రావు, సాయాగౌడ్, వాజిద్‌అలీ, సరిత, కార్తిక్, డీఏఓ తిరుపతి ప్రకాష్, ఎలక్షన్ డీటీ కమలాకర్, సీఐ రామలింగారెడ్డి, ఎస్ఐ వెంకటరెడ్డి, ఏజీపీ వీజీకే మూర్తి, రెవెన్యూ సిబ్బంది, బీఆర్‌ఎస్ నాయకులు, పాల్గొన్నారు.

వెంకట్‌రెడ్డికి నివాళి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో సీపీఎం సీనియర్ నాయకుడు పులిచింతల వెంకటరెడ్డి మృతదేహాన్ని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి శనివారం సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం వెంకటరెడ్డి నిబద్ధతతో పని చేశారన్నారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, అమర్ గౌడ్, నాయకులు అట్లూరి హరిబాబు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల పితామహుడు సీఎం కేసీఆర్

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



చిలుకూరులో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్



కోదాడరూరల్ : సిమెంట్ బల్లాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

చిలుకూరు : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరం అని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శనివారం చిలుకూరులోని రైతు వేదిక వద్ద 73 మంది లబ్ధిదారులకు 73 లక్షల 8 వేల రూపాయల విలువ గల కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 14 మంది లబ్ధిదారులకు 4 లక్షల 72 వేల రూపాయల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాల పితామహుడని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కేసీఆర్‌కు ఓటు వేసి రుణం తీర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీఓ ఈదయ్య, డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదయ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానిమియా, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు దొడ్డా సురేష్‌బాబు, సొసైటీ చైర్మన్లు అలసకాని జనార్దన్, బాషం సైదులు, వైస్ చైర్మన్ అక్కినపల్లి జానకీరామాచారి, సర్పంచ్ కొడారు బాబు, వట్టికూటి చంద్రకళ, తమ్మన బోయిన శంకర్, నందలాల్, ఎంపీటీసీ బెల్లంకొండ రమణ నాగయ్య, డీఎల్‌డీఏ డైరెక్టర్ కస్తూరి నర్సయ్య, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, సొసైటీ డైరెక్టర్లు, వార్డు సభ్యులు, గ్రామస్తులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

నడిగూడెం : తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శమని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో పాటు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. ఆడబిడ్డల పెళ్లిల కోసం మండలానికి చెందిన 600 మంది లబ్ధిదారులకు దాదాపు ఆరు కోట్ల రూపాయలు అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యాతాకుల జ్యోతి, తహసీల్దార్ టి.నాగేశ్వరరావు, ఎంపీడీఓ యం.యర్రయ్య, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ కాసాని వెంకటేశ్వర్లు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దేవబత్తిని వెంకటనర్సయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి, నాయకులు దేవబత్తిని సురేష్ ప్రసాద్, పాలడుగు ప్రసాద్, బడేటి చంద్రయ్య, అనంతుల ఆంజనేయులు, శ్రీనివాస రెడ్డి, ఉపేందర్, పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

కోదాడరూరల్ : సామాజిక సేవలో వాసవీక్లబ్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. శనివారం పట్టణంలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ప్రజలు సేదతీరేందుకు పలు చోట్ల సిమెంట్ బల్లాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని అన్నారు. ఇలాంటి సేవ కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలుంటాయని తెలిపారు. వాసవీ క్లబ్ అధ్యక్షులు ఇమ్మడి సతీష్‌బాబు, ప్రధాన కార్యదర్శి శ్రీనివారావు, రాయపుడి వెంటనారాయణ, డాక్టర్ బ్రహ్మం, వంటిపులి శ్రీనివాస్, ప్రసాద్, గీత, విజయ్‌శేఖర్, సత్యనారాయణ, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

బీజేపీని అధికారంలోకి తీసుకురావాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొణతం లచ్చిరెడ్డి

నేరేడుచర్ల : రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొణతం లచ్చిరెడ్డి అన్నారు. శనివారం నేరేడుచర్లలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోదీ ప్రభుత్వం 9 ఏళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. జూన్ 1వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు నేరేడుచర్ల మండలంలో పార్టీ మండల బాధ్యులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, బుత్ అధ్యక్షులు విస్తృతంగా పర్యటన చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బాల వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు పొర్తనబోయిన విజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు సంకలమద్ది సత్యనారాయణరెడ్డి, నాయకులు సత్యనారాయణ, రామ్మూర్తి, నాగిరెడ్డి, విజయ్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, పవన్, సతీష్, సత్యం, సైదులు, సైదిరెడ్డి, నారాయణరెడ్డి, బక్కిరెడ్డి, రాంరెడ్డి, మట్టయ్య, ఆంజనేయులు, శ్రీకాంత్ తదితరులున్నారు.

ప్రజలకు సేవ చేయడంలోనే ఆనందం



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న గ్రామ పెద్దలు

నడిగూడెం : ప్రజలకు సేవ చేయడం ఆనందంగా ఉందని సిరిపురం గ్రామానికి చెందిన డాక్టర్.జంపాల శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని సిరిపురంలో ఇటీవల నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో పలువురికి కళ్లద్దాలు అవసరమవగా శనివారం ఆయన గ్రామ పెద్దలతో కలిసి వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మొక్క భిక్షపతి, శెట్టి సతీష్, సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, తాళ్లూరి రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఇదేనా



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

హుజూర్‌నగర్ : ప్రజాసమస్యలపై శాతియుతంగా ఆందోళన చేస్తున్న నాయకులపై దౌర్జన్యంగా ప్రవర్తించడమేనా ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే అని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి యల్క సోమయ్యగౌడ్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేదల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం మోతె మండల కమిటీ ఆధ్వర్యంలో విభళాపురంలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకుడిపై మోతె ఎస్ఐ విచక్షణరహితంగా దౌర్జన్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. సీపీఎం నాయకులను గల్లా పట్టి గుంజి నేలపై విసిరేసిన ఎస్ఐని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పోరాడే హక్కు ప్రతి పౌరుడికి ఉందని.. పోరాడే తెలంగాణను సాధించుకున్నామని గుర్తు చేశారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా నాయకులు జయకృష్ణ, వి.వెంకన్న, బాల శౌరెడ్డి, ముస్తఫా, వేణు, నరేష్, అక్బర్, సాయి, నగేష్, నజీర్, రామకృష్ణ, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సైదులు, ప్రభాకర్, అంజయ్య, అశోక్, నాగుల్ మీరా పాల్గొన్నారు.

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం



వైద్యశిబిరంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, కార్మికులు

మునగాల : ఉచిత వైద్య శిబిరాలను భవన నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కోల ఉపేందర్‌రావు కోరారు. శనివారం మండలంలోని తాడువాయి గ్రామపంచాయతీ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం లేబర్ కార్డు కల్గిన ప్రతి కార్మికుడికి ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భవ నిర్మాణ కార్మిక సంఘం మండల నాయకులు కోల ఆంజనేయులు, మాతంగి వెంకన్న, కోట వెంకటేశ్వర్లు, వల్లోజు శ్రీను, మొలుగూరి సైదులు, సోము పుల్లయ్య, వైద్య సిబ్బంది శ్రావణ్‌కుమార్, నజీర్, మహేష్, నజీర్, పవన్, విక్కీ పాల్గొన్నారు.

రూ.3వేలు జరిమానా

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని ఇమాంపేట గ్రామంలో నిర్మించిన బస్‌షెల్టర్‌పై జిల్లా కేంద్రానికి చెందిన పాఠశాల, కళాశాల యాజమాన్యం పోస్టర్లు, ఫ్లెక్సీలు అంటించారు. నూతనంగా నిర్మించిన బస్‌షెల్టర్‌పై అంటించిన పోస్టర్లు, ఫ్లెక్సీలను ఎంపీడీఓ శ్రీనివాసరావు శనివారం పరిశీలించి సదరు యాజమాన్యానికి రూ. 3వేలు జరిమానా వేశారు. ఆ నగదును గ్రామ పంచాయతీకి జమ చేశారు. పోస్టర్లను, ఫ్లెక్సీలను తొలగించారు. సర్పంచ్ పాముల ఉపేందర్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు ఆ ఇద్దరు దూరం

- హాజరుకాని ఎంపీపీ, జెడ్పీటీసీ

చిలుకూరు : మండలంలో జరిగే అధికారిక కార్యక్రమాలకు మండల ప్రథములైన ఎంపీపీ బండ్ల ప్రశాంతికోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్ర బాబులు గత కొద్ది కాలంగా హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. స్థానిక ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పాల్గొనే కార్యక్రమాలకు వారు కొంతకాలంగా దూరంగా ఉంటున్నారు. శనివారం చిలుకూరులో జరిగిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి వారు హాజరు కాలేదు. అలాగే ఇటీవల సీఎం కప్ క్రీడల ప్రారంభోత్సవంలో కూడా పాల్గొనలేదు. దాదాపు రెండేళ్లుగా ప్రభుత్వ కార్యక్రమాలకు ఎమ్మెల్యే వస్తే వారిద్దరూ వెళ్లడం లేదు. అయితే ఇన్నాళ్లు వారి మార్గంలోనే నడిచిన మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ అయిన బేతవోలు సర్పంచ్ వట్టికూటి చంద్రకళ నాగయ్య శనివారం మండల కేంద్రంలోఎమ్మెల్యే చేతుల మీదుగా జరిగిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి రావడం ఆసక్తికరంగా మారింది. అయితే పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నారని గత కొంత కాలంగా ఎంపీపీ, జెడ్పీటీసీలను పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంచారు. వీరిని పార్టీ నాయకులే కార్యక్రమాలకు పిలవడం మానేశారు. దీంతో వారు కూడా వెళ్లడం లేదు. అలా దూరం పెరిగి పెరిగి అధికార కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొంటే ఎంపీపీ, జెడ్పీటీసీలు వెళ్లడం బంద్ చేశారు. అధికారుల వద్ద నుంచి ఆహ్వానం ఉన్నా అటు వైపు చూడడం లేదు. ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ బీఆర్‌ఎస్‌లో నెలకొన్న వర్గపోరు ఎటు దారి తీస్తుందోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

జామాయిల్ తోట దగ్ధం



కొక్కిరేణిలో దగ్ధమైన జామాయిల్ తోట

మునగాల : మండల పరిధిలోని కొక్కిరేణి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని సాగుచేసిన జామాయిల్ తోట దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పోటు రవీంద్రనాథ్ తనకున్న 10ఎకరాల్లో జామాయిల్ తోట సాగుచేశాడు. ఇప్పటి వరకు రెండు కోతలు కోయగా మూడవ కోతకు సిద్ధంగా ఉంది. కాగా గ్రామంలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో సాగుచేసిన వరిపొలాల కొయ్యలకు కొందరు రైతులు నిప్పు అంటించగా గాలివాటానికి మంటలు జామాయిల్ తోటకు అంటుకోవడంతో దగ్ధమైంది. సుమారు రూ.పది లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధిత రైతు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

నూతనకల్ : ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏపూరి సోమన్న అన్నారు. శనివారం మండల పరిధిలోని చిల్పకుంట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి రెండు నెలులు గడుస్తున్నప్పటికీ ధాన్యాన్ని కొనుగోలు చేసి తరలించడంలో విఫలమయ్యారని అన్నారు. అకాల వర్షానికి ధాన్యం రంగుమారిందని మిల్లర్లు అధిక మొత్తంలో కోత విధించడంతో రైతులు భారీగా నష్టపోతున్నారని తెలిపారు. వానాకాలం సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతులు కల్లాల్లోనే ఉండే పరిస్థితి దాపురించిందని అన్నారు. నియోజకవర్గంలో సంక్షేమ పథకాల అమలులో జరిగిన అవినీతిపై ప్రశ్నిస్తున్న వారిపై ఎమ్మెల్యే కిశోర్ అనుచరులు దాడులకు పాల్పడటం సమంజసం కాదని తెలిపారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌టీపీ నాయకుడు ఇరుగు శ్రీనివాస్‌ను పరామర్శించి రూ. 5వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు ముత్యం రవిగౌడ్, మేకల నాగన్న, సాంబయ్య, వెలుగు అంజయ్య, చందా వెంకన్న, గాజుల సురేందర్ పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంతో ఉపాధి



పుట్టగొడుగుల పెంపకం విధానాన్ని వివరిస్తున్న గృహవిజ్ఞాన శాస్త్రవేత్త సుగంధి

గరిడేపల్లి : పుట్టగొడుగుల పెంపకంతో మంచి పోషకాహారంతో పాటు స్వయం ఉపాధి కూడా పొందవచ్చని గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుగంధి అన్నారు. శనివారం మండలంలోని గడ్డిపల్లిలో గల కేవీకేలో పుట్టగొడుగుల పెంపకంపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టగొడుగుల పెంపకానికి కావాల్సిన నైపుణ్యత గురించి తెలుసుకోవాలన్నారు. పుట్టగొడుగుల పెంపకం చేపట్టిన వారికి కేవీకే ద్వారా శిక్షణ, సాంకేతిక సలహాలు, సూచనలు, వివిధ రకాల పుట్టగొడుగుల పెంపకం యాజమాన్యం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గడ్డిపల్లి, గరిడేపల్లి, నేరేడుచర్ల, సూర్యాపేట యువతులు పాల్గొన్నారు.

వడదెబ్బతో కాంగ్రెస్ నాయకుడు మృతి



పాచ్యానాయక్ (ఫైల్)

అనంతగిరి : మండలంలోని కొత్తగోల్ తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాణోతు పాచ్యానాయక్ (90) వడదెబ్బతో మృతిచెందారు. ఎండలు విపరీతంగా ఉండడంతో గత వారం రోజులుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న ఆయన శనివారం సాయంత్రం మరణించారు. పాచ్యానాయక్ గతంలో వార్డు మెంబర్‌గా పనిచేశారు. ఆయన భార్య బాణోతు మంగ్లీ, కుమారుడు బాబునాయక్, మనవరాలు త్రివేణిలు సర్పంచ్‌లుగా పనిచేశారు. మరో మనవరాలు ధనలక్ష్మి గత ఎన్నికల్లో జెడ్పీటీసీగా గెలుపొందారు. నల్గొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిలతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులతో పాచ్యానాయక్ కుటుంబానికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. పాచ్యానాయక్ మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుసుకుల గోపాల్‌రెడ్డి, జొన్నలగడ్డ కోటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం వెంకటరెడ్డి, సర్పంచ్ ముత్తినేని కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపం తెలిపారు.